- విద్యార్థులు క్రీడల్లో రాణించేందుకు పీఈటీలతో ప్రత్యేక శిక్షణ
- కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్
- కడ్తాల్‌లో అట్టహాసంగా ప్రారంభమైన ఎస్‌జీఎఫ్‌ఐ జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు



జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న ఇరు జట్ల క్రీడాకారులు

# క్రీడలకు ప్రభుత్వ ప్రోత్సాహం


కడ్తాల్, సెప్టెంబర్ 30: ఆటల పోటీల్లో క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తున్నదని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా-67జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కడ్తాల్, ఇబ్రహీంపట్నం, సరూర్‌నగర్, షాద్‌నగర్, రాజేంద్రనగర్, శంకర్‌పల్లి, శేరిలింగంపల్లి, మహేశ్వరం జోన్లకు చెందిన విద్యార్థులు పాల్గొనగా.. ఈ పోటీలను ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ జ్యోతి వెలిగించి ప్రారంభించి, క్రీడాకారుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పా టు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. క్రీడలు మానసిక, శారీరక వికాసానికి ఎంతో దోహదం చేస్తాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు క్రీడల్లో రాణించేందుకు ప్రభుత్వం పీఈటీలతో ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తున్నట్లు వివరించారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే తమకు ఇష్టమైన రంగాన్ని ఎంచుకుని ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు. ఇలాంటి టోర్నీలతో విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ తెలుస్తుందన్నారు. మన ఊరు-మన బడి కార్యక్రమంతో నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వసతులను కల్పిస్తున్నట్లు చెప్పారు. అనంతరం వాలీబాల్ పోటీల నిర్వహణకు ఎమ్మెల్యే వ్యక్తిగతంగా రూ.50 వేలను నిర్వాహకులకు అందజేశారు. సాయంత్రం వరకు జరిగిన పోటీల్లో బాలుర అండర్-17 విభాగంలో మొదటి స్థానంలో ఇబ్రహీంపట్నం, రెండోస్థానంలో మహేశ్వరం, అండర్-14 విభాగంలో తొలి స్థా నంలో కడ్తాల్, రెండోస్థానంలో షాద్‌నగర్ జట్లు నిలిచాయి. బాలికల అండర్-17 విభాగంలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, అండర్-14 విభాగంలో తొలి, ద్వితీయ స్థానాల్లో కడ్తాల్, షాద్‌నగర్ జట్లు నిలిచినట్లు జోనల్ కార్యదర్శి భీముడునాయక్ వివరించారు. గెలుపొందిన జట్లకు ప్రజాప్రతినిధులు, అధికారులు ట్రోఫీలతోపాటు ప్రశంసా పత్రాలను అందజేశారు.

## భక్తిభావాన్ని పెంచుకోవాలి

సమాజంలోని ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని పెంచుకోవాలని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మండలంలోని అన్మాస్‌పల్లి గ్రామంలోని వీరాంజనేయస్వామి ఆలయంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు నేనావత్ బిక్క్యానాయక్, చిత్ర దంపతులు నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలోనూ పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జడ్పీటీసీలు దశరథ్‌నాయక్, అనురాధ, విజితారెడ్డి, వైస్ ఎంపీపీ ఆనంద్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పరమేశ్, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, జోనల్ కార్యదర్శి భీముడు నాయక్, రైతుబంధు సమితి మండల, గ్రామాధ్యక్షులు వీరయ్య, నర్సింహ, ఏఎంసీ డైరెక్టర్లు లాయక్‌అలీ, రమేశ్‌నాయక్, భిక్షపతి, గణేశ్‌గౌడ్, రాజేందర్‌యాదవ్, రామచంద్రయ్య, తహసీల్దార్ షేక్ ముంతాజ్, ఎంపీడీవో రామకృష్ణ, ఎంఈవో సర్దార్‌నాయక్, నోడల్ అధికారి జంగయ్య, పీడీలు భీముడు, చంద్రమోహన్, జ్యోత్స్న, జ్యోతి, సుధాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, బాబయ్య, సాబెర్, సుశీల, రాజు, నర్సింహారావు, రాధ, ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.



జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభించి మాట్లాడుతున్న కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



వికారాబాద్ జిల్లాలో కాంగ్రెస్ కనుమరుగే..

# నో కాంగ్రెస్ ఓన్లీ బీఆర్‌ఎస్

- అభివృద్ధి చేస్తున్న బీఆర్‌ఎస్‌వైపే నిలుస్తున్న ప్రజానీకం
- నాలుగు నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్‌కు ఎదురుగాలి
- రేవంత్‌రెడ్డికి మరోసారి షాకిచ్చేందుకు సిద్ధమైన కొడంగల్ ప్రజలు
- స్థానికేతరుడు, అవినీతి ముద్రతో వికారాబాద్‌లో ప్రసాద్‌కుమార్‌కు వ్యతిరేకత
- పరిగిలో ప్రగతి వెంటే సబ్బండ వర్ణాలు..
- తాండూరు అభ్యర్థి ఎంపికలో రేవంత్ వర్సెస్ సీనియర్ల మధ్య కుమ్ములాట

వికారాబాద్, సెప్టెంబర్ 30, (నమస్తే తెలంగాణ): జిల్లాలో త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో నూ కాంగ్రెస్ పార్టీ కనుమరుగు కావడం ఖాయమనిస్తున్నది. గత ఎన్నికల్లో తాండూరు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున గెలుపొందిన రోహిత్ రెడ్డి అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్‌ఎస్ పార్టీలో చేరడం తో నాలుగు నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్ పార్టీకి ఎదురుగాలే వీస్తుండడం గమనార్హం. 60 ఏండ్లపాటు అధికారంలో ఉండి తెలంగాణ అభివృద్ధిని పట్టించుకోని ఆ పార్టీ నాయకులు.. ఈ సారి ఎన్నికల్లో గెలిచేందుకు అమలు సాధ్యం కాని కొత్త పథకాలను ప్రకటించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో కేవలం తొమ్మిదేండ్లలో దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రాధాన్యమిస్తూ దేశంలోని ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు. అంతేకాకుండా ఈ ప్రాంత ప్రజల ఎన్నో ఏండ్ల కల అయిన వికారాబాద్ జిల్లా ఏర్పాటుతోపాటు త్వరలోనే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును పూర్తి చేసి సాగునీరందించేందుకు చర్యలు వేగవంతం చేయడం, ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఏర్పాటు, గ్రామాల నుంచి జిల్లా కేంద్రం వరకు రోడ్ల ఏర్పాటు తదితర కనీవినీ ఎరుగని అభివృద్ధితో జిల్లా ప్రజలు అభివృద్ధివైపే నిలుస్తూ బీఆర్‌ఎస్ పార్టీకి జై కొడుతున్నారు. కాంగ్రెస్ హయాంలో ఏ అభివృద్ధి కార్యక్రమాన్ని, పథకాలను చేపట్టిన మధ్యవర్తుల ప్రమేయంతో ప్రభుత్వం అందజేసిన దానిలో 10 శాతం కూడా లబ్ధిదారులకు దక్కే పరిస్థితి ఉండేది కాదు. అంతేకాకుండా కాంగ్రెస్ హయాంలో జిల్లా లో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలోనూ, ప్రాణహిత చేవెళ్ల ప్రాజె క్టు విషయంలోనూ, శాటిలైట్ టౌన్‌షిప్ విషయంలోనూ పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడిన విషయం తెలిసిందే. అయితే బీఆర్‌ఎస్ ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, దళితబంధు, బీసీబంధు, మైనార్టీలకు రూ.లక్ష సాయం, కేసీఆర్ కిట్స్ తదితర పథకాల ఫలాలను మధ్యవర్తులతో సంబంధం లేకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోనే ప్రభుత్వం జమ చేస్తూ ఎలాంటి అవినీతి, అక్రమాలకు చోటు లేకుండా పారదర్శకమైన పాలన అందిస్తున్నది. తొమ్మిదేండ్లుగా ప్రజల ప్రభుత్వంగా పేరు సంపాదించుకున్న బీఆర్‌ఎస్ పార్టీని తప్పుడు ప్రచారం చేసి బద్నాం చేసే కుట్ర చేస్తున్నప్పటికీ కేసీఆర్ ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు తెలుపుతున్న ప్రజలు మాత్రం కాంగ్రెస్ పార్టీకి ఈ దఫా ఎన్నికల్లోనూ ఓటుతో బుద్ధి చెప్పేందుకు సిద్ధమయ్యారు. సీఎం అభ్యర్థిగా చెప్పించుకుంటున్న పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డితోపాటు మిగ తా తాండూరు, వికారాబాద్, పరిగి నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్ పార్టీ చిత్తుగా ఓడడం ఖాయమనే అభిప్రాయం జిల్లాలోని ఆయా వర్గాల నుంచి వ్యక్తమవుతున్నది.

## వికారాబాద్‌లో ప్రసాద్‌కుమార్‌కు వ్యతిరేకత..

వికారాబాద్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిగా రెండోసారి సిట్టింగ్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ బరిలోకి దిగుతున్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ప్రసాద్‌కుమార్‌ను ఓడించి మొదటిసారి విజయం సాధించారు. త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నిక ల్లోనూ ఆనంద్ భారీ మెజార్టీతో గెలువడం ఖాయంగా కనిపిస్తున్నది. ప్రసాద్‌కుమార్ స్థానికేతరుడు కావడంతో జనాలు వ్యతిరేకించడానికి ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన ప్రసాద్‌కుమార్ తల్లిదండ్రులు తాండూరుకు వలస రావడం, తదనంతరం మర్పల్లిలో తన పేరును ఓటరు జాబితాలో చేర్పించి స్థానికుడనంటూ ప్రజలకు తప్పుడు ప్రచారం చేస్తున్నప్పటికీ గత ఎన్నికల ముందు ప్రసాద్‌కుమార్‌కు స్థానికేతరుడనే ముద్ర పడిన దృష్ట్యా ఈసారి ఎన్నికల్లోనూ ఓటమి పాలవడం ఖాయమనే తెలుస్తున్నది. అలాగే గతంలో మంత్రిగా పనిచేసిన సమయంలో ప్రసాద్‌కుమార్ వికారాబాద్ నియోజకవర్గంలో ఇతర పార్టీల నేతలతోపాటు అమాయక ప్రజలపై అట్రాసిటీ కేసులు పెట్టించడంతోపాటు శాటిలైట్ టౌన్‌షిప్ ప్రాజెక్టులో భాగంగా వికారాబాద్ మున్సిపాలిటీని అప్పటి యూపీఏ ప్రభుత్వం ఎంపిక చేసిన తాగునీటి సరఫరా, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు విడుదల చేసిన రూ.174 కోట్ల నిధులు దుర్వినియోగం కావడంలో ప్రసాద్‌కుమార్ పాత్రే ఎక్కువని..కమీషన్లకు ఇబ్బందులు పెట్టడంతో కాంట్రాక్టర్ మధ్యలోనే పనులను వదిలేసి పారిపోయినట్లు వికారాబాద్ నియోజకవర్గమంతటా జోరుగా ప్రచారం జరుగుతున్నది. అంతేకాకుండా కాంగ్రెస్ హయాంలో చేనేత, జౌళి శాఖ మంత్రిగా పనిచేసినప్పటికీ వికారాబాద్ నియోజకవర్గానికి ఒక్కటంటే ఒక్క పరిశ్రమను కూడా తీసుకురాలేకపోయారని... మరోవైపు వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ఎన్నెపల్లిలో లింగాయత్ సొసైటీకి చెందిన భూమిని ప్రసాద్‌కుమార్ అనుచరులు కబ్జా చేయడంతోపాటు దౌర్జన్యానికి పాల్పడ్డారనే ఆరోపణలు కూడా గట్టిగా వినిపిస్తున్నాయి. అయితే బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఎమ్మె ల్యే ఆనంద్ సహకారంతో సంబంధిత భూమిని కబ్జా చెరల నుంచి తప్పించి లింగాయత్ సొసైటీకి అప్పగించారు. ఇంతా వ్యతిరేకత ఉన్న ప్రసాద్‌కుమార్ రానున్న ఎన్నికల్లోనూ ఓడిపోవడం ఖాయమని ఆయా వర్గాల మేధావులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## రేవంత్‌కు మరోసారి షాకిచ్చేందుకు..

కొడంగల్ నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్న పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డికి ఈ ఎన్నికల్లోనూ గట్టిగా షాకిచ్చేందుకు కొడంగల్ ప్రజలు సిద్ధమయ్యారు. గతంలో రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించినా... కొడంగల్ అభివృద్ధిని విస్మరించిన రేవంత్‌రెడ్డి త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఓటమి పాలవడం ఖాయమనే ప్రచారం జరుగుతున్నది. ఎమ్మెల్సీగా రెండు పర్యాయాలు చేసిన అనుభవంతోపాటు సీనియర్ నేత అయిన పట్నం నరేందర్‌రెడ్డిని గత ఎన్నికల్లో గెలిపించుకున్న కొడంగల్ ప్రజలు ఈ దఫా ఎన్నికల్లోనూ భారీ మెజార్టీతో గెలిపించేందుకు సిద్ధమయ్యారు. పూర్తిగా వెనుకబడిన నియోజకవర్గాన్ని సీఎం కేసీఆర్, ఐటీశాఖ మంత్రి కేటీఆర్ సహకారంతో ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధిలోకి తీసుకొచ్చారు. రేవంత్ నయాపైసా అభివృద్ధి చేయకుండా మాయమాటలు చెబుతూ కొడంగల్ ప్రజలను మోసం చేశారనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. వ్యక్తిగత ఆరోపణలు, భూకబ్జాల వ్యవహారాలు మినహా ఆయన ఎమ్మెల్యేగా పనిచేసిన సమయంలోనూ, ప్రస్తు తం కూడా కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధిని ఏనాడూ ప్రస్తావించకపోవడం గమనార్హం. అంతేకాకుండా ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికి జైలుకెళ్లొచ్చిన రేవంత్‌రెడ్డి తాజాగా పార్టీ టికెట్ కేటాయించేందుకు రూ. కోట్లు తీసుకున్నారని జోరుగా ప్రచారం జరుగుతున్నది. అవినీతి, అక్రమార్జన మరకలున్న రేవంత్‌రెడ్డిని ఓడించి చరిత్రలో నిలిచేపోయేలా కొడంగల్ ప్రజలు ఆలోచిస్తున్నట్లు వివిధ వర్గాల ద్వారా తెలుస్తున్నది.

## అభివృద్ధివైపే పరిగి ప్రజలు

త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పరిగి నియోజకవర్గానికి సంబంధించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామ్మోహన్‌రెడ్డికి మరోసారి ఓటుతో షాకిచ్చేందుకు పరిగి నియోజకవర్గ ప్రజలు సిద్ధమయ్యారు. కాంగ్రెస్ హయాంలో ఎమ్మెల్యేగా ఉండి పరిగి నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోని రామ్మోహన్‌రెడ్డి ఈసారి ఎన్నికల్లోనూ ఓడిపోవడం ఖాయమని వినిపిస్తున్నది. అంతేకాకుండా అసాధ్యమని తెలిసి కూడా ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును చేపట్టి, పైసా పని జరుగకుండానే కాంగ్రెస్ నేతలు కోట్లు కొల్లగొట్టారు. అసాధ్యమని తెలిసి కూడా ప్రాణహితతో పరిగి నియోజకవర్గానికి సాగునీరు వస్తుందని రామ్మోహన్ రెడ్డి అవాస్తవాలను ప్రచారం చేయడంతోపాటు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు ముందుకు సాగకుండా అడ్డుకునే కుట్రలోనూ భాగస్వామి అనే ప్రచారం ఆయనపై ఉన్నది. అంతేకాకుండా బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి కృషితో పరిగి నియోజకవర్గ అభివృద్ధికి భారీగా నిధులు తీసుకురావడంతోపాటు కనీవినీ ఎరుగని రీతిలో ప్రగతిపథంలోకి తీసుకెళ్లారు. ఇంటింటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్నారు. అంతేకాకుండా ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి విశేషంగా కృషి చేస్తున్నారు. దీంతో పరిగి నియోజకవర్గ ప్రజలు అభివృద్ధివైపే నిలుస్తూ మరోసారి మహేశ్ రెడ్డినే గెలిపించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తున్నది.

## తాండూరు టికెట్‌పై ఇంకా సందిగ్ధమే..

తాండూరు నియోజకవర్గ కాంగ్రెస్ టికెట్ కేటాయింపు విషయంలో ఇంకా సందిగ్ధమే కొనసాగుతున్నది. ఈ టికెట్ విషయంలో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి వర్సెస్ ఆ పార్టీ సీనియర్ల మధ్య చిచ్చురేపినట్లు జిల్లాలో చర్చ జరుగుతున్నది. దీంతో తాండూరు కాంగ్రెస్ అభ్యర్థి విషయంలో ఒక్కో రోజు ఒక్కో పేరు తెరపైకి వస్తుండడం గమనార్హం. కాంగ్రెస్ సీనియర్లు మల్లు బట్టి విక్రమార్కతోపాటు మరికొందరు కేఎల్‌ఆర్ (కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి) పేరును ఖరారు చేయాలని పట్టుబడుతుంటే, రేవంత్ రెడ్డి మాత్రం ఒప్పుకోవడం లేదని ఆ పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది. రేవంత్ రెడ్డి కొత్త వ్యక్తి పేరు ప్రస్తావిస్తుండడంతో తాండూరు అభ్యర్థి ఎంపిక ఇంకా పెండింగ్‌లోనే ఉన్నది. ఒకవేళ రేవంత్ రెడ్డి ప్రస్తావిస్తున్న వ్యక్తితోపాటు కేఎల్‌ఆర్ కూడా స్థానికేతరులు కావడంతో తాండూరు ప్రజలు వారిని నమ్మే పరిస్థితి ఉండదు. అయితే తాండూరు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎవరు బరిలో ఉన్నా తాండూరులో మరోసారి పైలట్ రోహిత్ రెడ్డి విజయం ఖాయమని సబ్బండ వర్ణాల ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# నాడు అధ్వానం.. నేడు అద్భుతం

రూ.16.80 కోట్లతో కాగ్నానదిపై నిర్మించిన కొత్త వంతెన



- బీఆర్‌ఎస్ హయాంలో తీరిన ప్రయాణ కష్టాలు
- రూ. వందల కోట్ల నిధులతో వంతెనల నిర్మాణంతో సాఫీగా ప్రయాణం
- మంత్రి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిని అభినందిస్తున్న ప్రజలు

తాండూరు, సెప్టెంబర్ 30: ఉమ్మడి ప్రభుత్వాల పాలనలో నియోజకవర్గంలోని రోడ్లు అధ్వానంగా ఉండగా.. సీఎం కేసీఆర్ సారథ్యంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో అద్భుతంగా కనిపిస్తున్నాయి. బీఆర్‌ఎస్ సర్కార్ అధికారం చేపట్టిన అనంతరం ప్రజా రవాణా వ్యవస్థకు అధిక ప్రాధాన్యమిచ్చింది. ఇందుకోసం కోట్లాది రూపాయలను వెచ్చించి రోడ్ల నిర్మాణం, వంతెనలను ఏర్పాటు చేస్తున్నది. జిల్లా కేంద్రం మొదలుకొని గ్రామ పంచాయతీల వరకు లింకు రోడ్ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతుండడంతో పల్లెదారుల రూపురేఖలు పూర్తిగా మారిపోతున్నాయి. ఎక్కడ చూసిన సిమెంట్, తారు రోడ్లు అందంగా దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా ప్రత్యేక నిధులు వెచ్చించి వంతెనలను నిర్మించడంతో ప్రయాణం సాఫీగా సాగుతున్నది. గతంలో వానకాలం వస్తే చాలు.. వాగులు, చెరువులు పొంగిపొర్లి రోడ్లు వరదకు కొట్టుకుపోయిన పరిస్థితులు కోకొల్లలు. దీంతో ప్రజల రాకపోకలు పూర్తిగా నిలిచిపోవడంతోపాటు రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించేది. ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డాక బీఆర్‌ఎస్ పాలనలో సీఎం కేసీఆర్ ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. మంత్రి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులతో చర్చలు జరిపి వాగులు, పెద్ద చెరువులు పొంగిపొర్లి రవాణా స్తంభించే ప్రాంతాలను గుర్తించి తాండూరు నియోజకవర్గంలో అవసరం ఉన్న రోడ్లపై వంతెనలను నిర్మించి ప్రజల ఇబ్బందులను తొలగించారు. ముఖ్యంగా తాండూరు-కొడంగల్ మార్గంలో కాగ్నానదిపై రూ.16.80 కోట్లతో బ్రిడ్జిని నిర్మించడంతో భారీ వర్షం పడినా ప్రయాణం సాఫీగా జరుగుతున్నది. అదేవిధంగా బషీరాబాద్ మండలం జీవన్గీ-కరణ్‌కోట్ మార్గంలో వాగుపై రూ.13.40 కోట్లతో వంతెన, రూ.11.80 కోట్లతో తాండూరు-నారాయణపూర్ వాగుపై, తాండూరు-వికారాబాద్ మార్గంలో రూ.15.30 కోట్లతో , తాండూరు-కోట్‌పల్లి మార్గంలో రూ.8.90 కోట్లతో వంతెనలు నిర్మించారు. వీటితోపాటు విర్‌శెట్టిపల్లి-గోనూర్‌తోపాటు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లోని చెరువులపై వంతెనలు నిర్మించారు. బొంకూర్-బిజ్వార్‌తోపాటు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో వంతెనల నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించగా..త్వరలోనే పనులను ప్రారంభించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. తాండూరు నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న మంత్రి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిని ప్రజలు అభినందిస్తూ మద్దతు తెలుపుతున్నారు.



రూ.11.80 కోట్లతో తాండూరు-నారాయణపూర్ వాగుపై ఏర్పాటు చేసిన వంతెన





హైదరాబాద్ రోడ్డు మన్‌సాన్‌పల్లి సమీపంలో వంతెన లేకముందు భూమికి మట్టంగా ఉన్న రోడ్డు





హైదరాబాద్ రోడ్డు మన్‌సాన్‌పల్లి సమీపంలోని నూతనంగా నిర్మించిన కల్వర్టు



జీవన్గి-కరణ్‌కోట్ మార్గంలో వాగుపై రూ.13.40 కోట్లతో ఏర్పాటు చేసిన వంతెన